తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం అసిఫాబాద్
మహబూబాబాద్
మంగళవారం
12 ఆగస్టు 2025
పేజీలు : 08



## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లుపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్, కార్యక్రమాల నిర్వహణ, సాంస్కృతిక ప్రదర్శనలు, భద్రతా ఏర్పాట్లు, వేదిక అలంకరణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అసెట్స్ పంపిణీకి లబ్ధిదారుల జాబితా తయారు చేయాలన్నారు. డా బిఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో జరిగే ఈ కార్యక్రమాలకు షామియానా, కుర్చీలు, వైద్య కేంద్రం, అంబులెన్స్, త్రాగునీరు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు మిగతా 2లో..

# అటవీ భూములు అన్యాక్రాంతం



### రాత్రి వేళల్లో జెసిబి, డోజర్ ట్రాక్టర్లతో చెట్లను తొలగింపు?

- అటవీ ప్రాంతాల్లో మళ్లీ పుంజుకుంటున్న పోడు భూముల వ్యవహారం...

**మంగపేట ఆగస్ట్ 11(జనంసాక్షి) :** రాష్ట్రంలో అడవులను పెంచాలని ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పంతో వనమహోత్సవాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలను పెంపొందిస్తూ ముందుకు వెళుతుంటే కొందరు అటవీశాఖ అధికారులు మాత్రం కాసులకు కక్కుర్తిపడి పోడు భూముల విస్తరణకు చెట్ల కొట్టివేతలకు సహకరిస్తున్నట్లు అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ఇలా ఉండగా గత కొంతకాలంగా మండలంలో పూర్తిగా ఆగిన పోడు భూముల వ్యవహారం మళ్లీ షురూ అయిన జాడలు కనిపిస్తున్నాయి. పలు గ్రామపంచాయతీల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో అక్కడక్కడ ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన కొందరు రైతులు పోడు విస్తరణకు పాల్పడుతూ ఇష్టానుసారంగా అడవులను పలుకుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం అంతా అటవీ అధికారులకు తెలిసే జరుగుతుందని ఆయా గ్రామాల్లో ప్రచారం జోరుగా సాగుతున్న అటవీ అధికారులు మాత్రం ఆ దిశగా దృష్టి సారించి పోడు నరికివేతలను నిలువరించకపోవడంతో పాలు అనుమానాలకు బలం చేకూరుస్తుంది. మండలంలోని 43వ కంపార్ట్మెంట్ లో ఆర్ఓఎఫ్ఆర్ కింద 2 నుండి 5 ఎకరాల వరకు పట్టాలు పొందిన కొందరు రైతులు ఇటీవలే పాత పోడు భూములను అనుకొని ఉన్న అడవులను నరికి జెసిబి, డోజర్ల సహాయంతో చదును చేసినట్లు ఆ పరిధిలోని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అడవుల్లోని గుట్టలు, వాగులు, వొర్రెలు నుండి నిత్యం నీరు ప్రవహించే ప్రాంతాల్లో రెండు పంటలు వేసుకునేందుకు భూములు అనుకూలంగా ఉండడంతో వారు తోడు విస్తరణకు వేగవంతంగా చేపడుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో కొందరు అటవీశాఖ అధికారులను మంచిగా చేసుకొని పాతపోడు రైతులు కొత్తగా విస్తరించే పోడుకు ఎకరానికి సుమారు లక్ష రూపాయల వరకు ముట్టచెబుతున్నట్లు ఆరోపణలున్నాయి. వారి అండదండలతో ఏకంగా రాత్రి వేళల్లో జెసిబి, డోజర్లతో పోడు ప్రాంతాన్ని చదును చేయడంతో పాటు ఆర్ఓఎఫ్ఆర్ లో పట్టా చేసే వరకు సంబంధిత అధికారులు సహకరించాలని షరతులతోనే రైతులు డబ్బులు ముట్టచెబుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఇప్పటికైనా జిల్లా అటవీశాఖ అధికారులు మండలంలోని కొత్తపోడు వ్యవహారంపై దృష్టి పెట్టి అక్రమార్కులకు సహకరిస్తున్నటువంటి మిగతా 8లో..

# అర్హులైన పేదలకు తెల్ల రేషన్ కార్డుల పంపిణీ

- పేదవాడి కడుపు నింపేందుకే సన్న బియ్యం పథకం
- రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**కాటారం ఆగస్టు 11( జనం సాక్షి):** పేద వాడి కడుపు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం కాటారం మండల కేంద్రంలోని బివిఎం గార్డెన్ లో కాటారం, మహాదేవపూర్, మహ ముత్తారం, మలహర్, పలిమెల మండలాలకు సంబంధించిన అర్హులైన పేదలకు తెల్ల రేషన్ కార్డులను అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 10 సంవత్సరాల కాలం పాటు పేద కుటుంబానికి రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవని, రాష్ట్రంలో అధికారంలోని వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో కరెంట్ బిల్లు కట్టక పోతే కనెక్షన్ కట్ చేసేవారని పేద కుటుంబానికి ఇబ్బంది జరగ కూడదని ప్రభుత్వం ఏర్పాటు కాగానే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, గృహ జ్యోతి పథకం కింద 52వేల కుటుంబాలకు 26 కోట్ల రూపాయలు ఈ జిల్లా లో ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం ఏర్పాటు కాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం,ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు విడతల వారిగా పూర్తి చేస్తామని, రైతు భరోసా పథకం కింద 9రోజులలో 9వేల కోట్లు రూపాయలు రైతుల ఖాతాలో వేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పులు చేసిన రాష్ట్రాన్ని సంక్షేమ వైపు నడిపిస్తున్నాం ఇచ్చిన హామీ లను నెరవేరుస్తాం రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లో ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుక వెళతామని,విద్యా వ్యవస్థను సైతం బలోపేతం చేస్తూ ఈ ప్రాంత విద్యార్థులకు 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మించబోతున్నమని, మిగతా 8లో..

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 11 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి పట్టణానికి చెందిన దుర్గం మోహన్ తాను నెన్నెల మండలం నెన్నెల శివారులో కొనుగోలు చేసిన భూమికి తన పేరిట పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం శ్రీరాంపూర్ శాఖ ప్రతినిధులు తమ దరఖాస్తులో శ్రీరాంపూర్ ప్రాంతంలో అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు.నస్పూర్ మండలం శ్రీరాంపూర్ కు చెందిన కోట మల్లయ్య తాను గత 35 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ఇల్లు వేరొకరి పేరిట మార్పు జరిగిందని, ఈ విషయమై తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నస్పూర్ మండలం సంగమల్లయ్యపల్లె గ్రామానికి చెందిన ఎం. వెంకటేశం తన ఇల్లు కూలిపోయినందున రికార్డుల నుండి ఇంటి నెంబర్ తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామానికి చెందిన చింతం నారాయణ తనకు బట్వాన్ పల్లి శివారులో గల భూమికి సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరుపకూడదని కోరుతూ అర్జీ సమర్పించారు. భీమారం మండలం సుంకరిపల్లి కాలనీకి చెందిన దుర్గం భాగ్య దినసరి కూలీ అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మాల మహానాడు ప్రతినిధులు తమ దరఖాస్తులో ప్రభుత్వం తీసుకువచ్చిన షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. మంచిర్యాల పట్టణంలోని 10, 28 వార్డులో గల మారుతీ నగర్ రోడ్ నం.2 కాలనీవాసులు తమ ప్రాంతంలో మిగతా 8లో..

## రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

• మండల వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ రెడ్డి

**చెన్నారావుపేట, ఆగస్టు 11 (జనంసాక్షి):** రైతు బీమా కోసం గ్రామాలలోని రైతులు ఈనెల 13వ తేదీ బుధవారం వరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ రెడ్డి సోమవారం తెలిపారు. జూన్ 5 వరకు కొత్త పట్టా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు, ఇంతవరకు రైతు బీమా చేసుకొని వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డులో 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వయసు ఉన్న రైతులు మాత్రమే రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం, రైతు ఆధార్ కార్డు, రైతు పట్టాదారు పాసుబుక్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ లతో దరఖాస్తులను సమర్పించాలన్నారు.ఈ అవకాశాన్ని గ్రామాల లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నేడు 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక

**చెన్నారావుపేట, ఆగస్టు 11 (జనంసాక్షి):** నేడు మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సభను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నల్ల శ్రీవాణి, ఏపీఓ అరుణలు సోమవారం తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని 30 గ్రామాలలో 1 ఫిబ్రవరి 2024 నుండి 31 మార్చి 2025 వరకు జరిగిన ఉపాధి హామీ పనుల పై సామాజిక తనిఖీ బృందాలు గ్రామాలలో తనిఖీలు నిర్వహించి గ్రామాలలో గ్రామసభలు పూర్తి చేశారని తెలిపారు. తుది నివేదికను ప్రజావేదిక సభలో సమర్పిస్తారని ప్రజా వేదిక సభ ఉదయం 10 గంటలకు చెన్నారావుపేట మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో జరుగుతుందని గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలి

• చెన్నారావుపేట విద్యుత్ ఏఈ జోగానంద్

**చెన్నారావుపేట, ఆగస్టు 11 (జనంసాక్షి):** విద్యుత్ సమస్యలు ఉంటే విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక లో పరిష్కరించుకోవాలని చెన్నారావుపేట విద్యుత్ ఏఈ జోగానంద్ సోమవారం తెలిపారు. నేడు మంగళవారం ఉదయం 10:30 నుండి 1:00 వరకు 33/11 కెవి నెక్కొండ మండలంలోని అలంకాని పేట సబ్ స్టేషన్ నందు తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధిక బిల్లులు, విద్యుత్ సమస్యలు, విద్యుత్తు సంబంధించిన ఇతర ఏ సమస్యలు ఉన్న పరిష్కార వేదికలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. గ్రామాలలోని విద్యుత్ విని యోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మెగా పాటల పోటీలకు అపూర్వ స్పందన




**నిర్మల్ బ్యూరో, ఆగస్టు10 (జనంసాక్షి):** మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సమావేశ మందిరంలో అఖిలభారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మెగా పాటల పోటీలు నిర్వహించారు. 40 మందికి పైగా గాయని గాయకులు పాల్గొన్నారు.పలువురు పాడిన పాటలు చూపరులను ఆకర్శింపజేశాయి.వేణుగోపాల్ వర్మకి ప్రథమ బహుమతి, గడ్డం రాధకు ద్వితీయ బహుమతి , వాసర శ్రీకాంత్ కు తృతీయ బహుమతి తోపాటు మరో ఐదుగురికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ పాటల పోటీలకు న్యాయ నిర్ణీతలుగా నార్లాపురం రవీందర్ , జోసెఫ్ బాబురావు , కవిత, , డాక్టర్ శ్రీరాముల తేజలు వ్యవహరించి విజేతలకు షీల్డ్ లను, ప్రశంసా పత్రాలను యం.సి.లింగన్న సౌజన్యంతో అందజేశారు.. ఈ కార్యక్రమంలో జాతీయ రిటైర్డ్ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి యం. సి.లింగన్న , నార్లాపురం రవీందర్ ,చెనిగారపు నాగరాజు,ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ కృష్ణంరాజు ,అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షులు శ్రీరాముల శ్రీనివాస్, జూడా రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ శ్రీరాముల తేజ, న్యాయవాది వోస మహేందర్, నిర్మల్ సేవా సమితి అధ్యక్షుడు శ్రీ నాయిడి రమేష్ , లంగ్డె విజయ్ చిరంజీవి, పవన్ కళ్యాణ్ అభిమానులు,పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన పిల్లలు ఆరోగ్యకరమైన దేశం

• ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్





**మహబూబాబాద్ ప్రతినిధి, గూడూరు ఆగస్ట్11 (జనంసాక్షి) :** మహబూబాబాద్ శాసన సభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్ ముఖ్య అతిదిగా దామరవంచ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్స వాన్ని కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మహబూ బాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రత, సంక్షేమం కోసం అనేక కీలక కార్యక్రమా లను అమలు చేస్తోందని, ముఖ్యంగా గిరిజన గ్రామాలలో జాతీ య నిర్మూలన కార్యక్రమం ద్వారా నిర్దిష్ట వ్యాధుల ను పూర్తిగా నిర్మూలించడం ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపు ముందస్తు నిరోధక చర్యలను విస్తృతంగా అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావ డానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు ఆరోగ్య సిబ్బంది ప్రజలు అందరూ చురుకుగా పాల్గొనా లని పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి రాథోడ్ మాట్లాడుతూ ఒక సంవత్సరం నుంచి 19 సంవ త్సరాల లో పిల్ల లందరూ పాఠశాలలు మరియు అంగన్వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోలు మాత్రలు ఇవ్వబడతాయని ఒకటి నుంచి రెండు సంవత్సరాల వయసు గల పిల్లలకు సగం ఆల్బెండజోల్ మాత్రలు చూర్ణం చేసి అందించాలని రెండు నుంచి మూడు సంవత్సరాల వయసున్న పిల్లలకు మాత్రమే చూర్ణం చేసి పరిశుభ్రమైన త్రాగునీటితో అందిం చాలని మూడు సంవ త్సరాలు కంటే ఎక్కువ వయసు ఉన్న పిల్లలు ఆల్బె ండజోళ్ళు మాత్రమే సరిగ్గా నమిలి పరిశుభ్రమైన త్రాగునీటితో మింగా లని ఆల్బెండజోల్ మాత్రమే ఇంటికి ఇవ్వరాదని పేర్కొన్నారు. ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవడం వల్ల, పోషకాహార లోపం అధిగమించవచ్చని, రక్తహీనత భారం తగ్గుతుందని, కడుపునొప్పి, వికారం, వాంతులు విరోచనాలు, తగ్గించుకోగలు గు తామని అన్నారు. ఈ కార్యక్ర మంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సారంగం స్థానిక వైద్యాధికారి డాక్టర్ యమునా ట్రైబల్ వెల్ఫే ర్ బాలుర ప్రిన్సిపల్ రమేష్ స్పెషల్ ఆఫీసర్ శ్రీని వాస్ హెల్త్ ఎడ్యుకేటర్ కెవి రాజు సబ్ యూ నిట్ ఆఫీసర్ రామకృష్ణ సూపర్వై జర్ కేవిఎన్ స్వామి, గోపీచంద్ లోకియా హెల్త్ అసిస్టెంట్ సర్దార్ ఉపాధ్యాయులు ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### వెలిశాల పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు

## నులి పురుగుల టాబ్లెట్ పంపిణీ చేసిన డాక్టర్ ఆశాజ్యోతి




**టేకుమట్ల ఆగస్టు 11 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లిలో టేకుమట్ల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెలిశాల. డాక్టర్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా వెలిశాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగింది . అనంతరం డాక్టర్ ఆశ జ్యోతి మాట్లాడుతూ ఒక సంవత్సరం నిండిన పిల్లల నుండి 19 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాఠశాలలో కళాశాలలో అంగన్వాడి కేంద్రాల్లో ఉచితంగా ఆల్బెండజోల్ టాబ్లెట్ ఇవ్వడం అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు ఈ మాత్రలు వేయడం వల్ల పిల్లలకు నులిపురుగులు రాకుండా నివారించవచ్చు తప్పనిసరిగా పిల్లలు ఈ ఆల్బెండజోల్ టాబ్లెట్ ని వేసుకోవాలని తెలియజేశారు . అదేవిధంగా చేతులు శుభ్రంగా కడుక్కోవడం వలన నులి పురుగులు రాకుండా నివారించవచ్చు . ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆశా జ్యోతి ప్రాథమిక ఉన్నత ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ హెల్త్ సూపర్వైజర్ విజయ ,హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, ఏఎన్ఎం సంగీత రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు మొగిలి ,సమత, రామారావు ,నరేష్ ,ముత్యం. ఆశా కార్యకర్త కోమల, డీఈవో రమేష్ ,అంగన్వాడి టీచర్స్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఎమ్మెస్ ఓబిజి ఫలితాల్లో

### నర్సంపేట వైద్య విద్యార్థి ప్రతిభ



**నర్సంపేట ఆగస్టు 11 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో వెలువడిన ఎమ్మెస్ ఓబి జి ఫలితాల్లో నర్సంపేటకు చెందిన వైద్య విద్యార్థి డాక్టర్ పొనుగంటి భావన తన ప్రతిభను చాటి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.... నర్సంపేట పట్టణానికి చెందిన మమత హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పొనుగంటి భారతిబిడాక్టర్ పొనుగంటి గోపాల్ల కూతురు డాక్టర్ పొనుగంటి భావన హైదరాబాదు లోని కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మరియు రీసెర్చ్ సెంటర్ నాగోల్లో ఎమ్మెస్ ఓబిజి వైద్య విద్యను అభ్యసిస్తుంది. ఇటీవల వెలువరి ంచిన ఫలితాల్లో భావన కామినేని మెడికల్ కళాశాలలలో ఓవరాల్గా ప్రథమ స్థానా న్ని రాష్ట్రస్థాయిలో మూడవ స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా కామినేని వైద్య కళాశాల యాజమాన్యం భావనను శాలువాతో సత్కరించి మెమొంటో అవార్డు అం దించి, భావన తల్లిదండ్రులను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాన్ని సాధించిన భావనను కామినేని వైద్య కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వసుంధర బిశశి ధర్ ,కళాశాల మెడికల్ సూపరెండెంట్ అంజయ్య, వైస్ ప్రిన్సిపాల్ పావని, అధ్యా పకులు తోటి వైద్య విద్యార్థులు, నర్సంపేట ఏమి అధ్యక్షులు డాక్టర్ బి.ఎం.జేయుడు డాక్టర్ ఉదయ్ సింగ్ డాక్టర్ రాజారాంతో పాటు పలువురు వైద్యులు,నర్సంపేట విద్యాసంస్థల అధినేతలు నర్సంపేట ప్రాంత పుర ప్రముఖులు అభినందించారు.

## విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



**చెన్నారావుపేట, ఆగస్టు 11 (జనంసాక్షి):** మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చెన్నారావుపేట వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ సునీత ఆధ్వర్యంలో సోమవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు, పేగు క్రిముల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలపై అవగాహన కల్పించారు. నులి పురుగుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.ఆల్బెండజోల్ మాత్రల వాడకం ద్వారా పిల్లల ఆరోగ్యాన్ని మెరుగు పరచవచ్చని నులి పురుగులను నివారించ వచ్చని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది లత, షాహీన్, రాజమణి, అయేషా, లత, ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, పిన్నింటి బాలాజీ రావు, ఉదయ్ కుమార్, మాధవి, మొగిలి, మాధవి, వర్థెల్లి సతీష్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్న, హంస రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ జాహేద్, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా తిరంగా యాత్ర

- ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలి
- కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు



**చిట్యాల ఆగస్టు 11 (జనంసాక్షి):** ప్రతి ఒక్కరూ జాతీయ భావం కలిగి, దేశభక్తిని కలిగి ఉండాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పొలసాని తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర ర్యాలీ ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పొలసాని తిరుపతి రావు పాల్గొన్నారు. అనంతరం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ భావం కలిగి దేశం ధర్మం వైపు ప్రయాణించాలని తెలిపారు. భారతీయులంతా ఐక్యమత్యం గా ఉండాలని, స్వాతంత్ర ఉద్యమంలో ఎంతో మంది ప్రాణత్యాగం చేసి మనకు స్వాతంత్రం కలుగజేశారని, ఈసారి 79 వ స్వాతంత్ర దినోత్సవాన్ని ప్రతి ఒక్కరు కూడా ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. యువత చెడు దారుల వైపు పోకూడదని, ప్రతి ఒక్కరు సోదర భావంతో కలిగి ఉండి మన దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి మన వంతు సహాయ సహకారాలు అందజేయాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తీగల జగ్గయ్య, సుదగాని శ్రీనివాస్, గుండా సురేష్, మందల మొగిలి, గజనాల రవీందర్, చింతల రాజేందర్, మార్త అశోక్, కదం రాజు, తీగల వంశీ, నీలి సుధాకర్ రెడ్డి, సాద సదానందం, బుర్ర అభిజ్ఞ ,బుర్ర వితేష్, గోల్కొండ అజయ్ పాల్గొన్నారు.

## నేటి తిరంగయాత్రను విజయవంతం చేయండి

- బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్



**టేకుమట్ల ఆగస్టు 10 (జనంసాక్షి):** టేకుమట్ల మండల కేంద్రంలో 79వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా హర్‌ఘర్ తిరంగా యాత్ర నిర్వహించడం జరుగుతుందని బిజెపి టేకుమట్ల మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్ అన్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో మంది మహానుభావుల ప్రాణత్యాగ ఫలితంగా వచ్చినటు వంటి స్వతంత్రదినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని భారత ప్రభుత్వం ఆదే శాలు జారీ చేసిందని కావున దేశంలో ఉన్న ప్రతిఒక్క భారతీయుడు స్వతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉన్నదని స్వతంత్ర ఉద్యమంలో పాల్గొని మరణించి నటు వంటి మహాను భావులను ఆదర్శంగా తీసుకొని మనంమన దేశాన్ని ఐకమ త్యంగా అభివృద్ధి చేసుకోవాలని ఆయన తెలియజేశారు మండల బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు.

# నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

### వైద్యాధికారిణి మౌనిక

**చిట్యాల ఆగస్టు 11 (జనంసాక్షి):** నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి అని ఒడితల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ రాగళ్ల మౌనిక అన్నారు .ఈ మేరకు సోమవారం మండలంలోని పలు పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల అంగన్ వాడి కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నట్లు తెలిపారు. పిల్లలలో నులిపురుగులు ఉండటం వలన వారిలో పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి మందగించడం తదితర అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని, వీటివల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలలో ఈ మాత్రలు అందుబాటులో ఉన్నాయని పిల్లలందరికి కేంద్రాలలో మాత్రలు తప్పకుండా ఇప్పించాలన్నారు. మండలంలో ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలకు మాత్రలు వేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఏదేని కారణాలతో మాత్రలు వేయని పిల్లలకు మాప్ అప్‌డే ఉంటుందని, ఆ రోజు తప్పనిసరి మాత్రలు అందజేయడం జరుగుతుందన్నారు. మాత్రల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని, ఎలాంటి అపోహలు పడొద్దని తెలిపారు. .మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులకు మాత్రలు వేయాలనీ, 1 సంవత్సరం నుండి 2 సంవత్సరాల వారికి సగం మాత్ర , రెండు సంవత్సరాలు ఆ పైబడిన వారికి పూర్తి మాత్ర నమిలి మింగించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## విజయవంతమైన నట్టల నివారణ మాత్రల పంపిణీ

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సరోజ



**చెన్నారావుపేట, ఆగస్టు 11(జనంసాక్షి):** నట్టల నివారణ మాత్రల పంపిణీ చెన్నారావుపేట మండలంలో విజయవంతం అయినట్లు చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సరోజ అన్నారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు, అంగన్వాడీ చిన్నారులకు నట్టల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. చెన్నారావుపేటలో సాంఘిక సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నట్టల నివారణ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చెన్నారావుపేట మండలంలో మొత్తం 12 వేల 171 మంది విద్యార్థులకు గాను 11 వేల 563 మందికి నట్టల నివారణ మాత్రలను వేసినట్లు తెలిపారు. మొత్తం 95 శాతం టార్గెట్ పూర్తి చేసినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ భద్రయ్య, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన దర్బార్‌లో సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐటీడీఏ



**ఏటూరునాగారం, ఆగష్టు 11(జనంసాక్షి):** ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో గిరిజనుల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత సెక్టార్ అధికారులకు ప్రాజెక్ట్ అధికారి చిత్ర మిశ్ర ఆదేశించినారు. ఈ గిరిజన దర్బార్ లో వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజనులు (15) దరఖాస్తులు జె వసంత రావు అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారికి మరియు వై పోచం డిప్యూటి డైరెక్టర్ కి స్వయంగా గిరిజనులు సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం రాజ్ కుమార్ పరిపాలన అధికారి (ఏఓ), ఏ అనిల్ డిప్యూటి తహసిల్దార్ ఎస్డీసి ఐటిడిఏ, ఆర్ మహేందర్ ప్రోగ్రాం ఆఫీసర్ డిప్యూటి డిఎంహెచ్వో ఐటిడిఏ, కె క్రాంతి కుమార్ డిప్యూటి డిఎంహెచ్వో, కొమురం ప్రభాకర్ పేసా కో ఆర్డినేటర్, అల్లెం కిషోర్ జియాలజిస్ట్ ఐటిడిఏ, ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రిన్సిపాల్ ఆర్ఐటిఐ ఏటూరునాగారం , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత



**చిట్యాల ఆగస్టు 11 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని కోసూరు పల్లి గ్రామానికి చెందిన ఎండి సాజిద్ ఫోన్‌వారం రోజుల క్రితం పోయింది. వెంటనే బాధితుడు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా స్పందించిన పోలీసులు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా అట్టి మొబైల్‌ను గుర్తించి సోమవారం అందజేశారు. మొబైల్‌ను గుర్తిం చడంలో భాగస్వాములైన కానిస్టేబుల్ లాల్ సింగ్‌ను ఎస్ఐ శ్రవణ్ కుమార్ అభినందించారు.

# దాతృత్వం చాటుకున్న మాజీ జెడ్పిటిసి శ్రీనివాస రావు



**పాలకుర్తి, ఆగస్టు 11 (జనంసాక్షి):** పాలకుర్తి తాజా మాజీ జెడ్పిటిసి పుస్కూరి శ్రీనివాసరావు తన జన్మదిన సందర్భంగా అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేసి, ఆర్థిక సహాయం అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.పుస్కూరి శ్రీనివాస్ రావు తన పుట్టినరోజు సందర్భంగా జఫర్గడ్ మండలం, సాగరం గ్రామంలోని అనాథ పిల్లల కోసం గాదె ఇన్నయ్య స్థాపించిన “మన ఇల్లు” అనాథ ఆశ్రమంలో ఉన్న పిల్లలకి ఆర్థిక సహాయం అందించి, పండ్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకుని మీకు ఎప్పుడైన ఏ అవసరాలు ఉన్న నేనున్నా అని వారికి మనోధైర్యా న్ని కల్పించారు. ఈ సందర్భంగా పుస్కూరి శ్రీనివాసరావుకు పిల్లలు ప్రత్యేక కృతజ్ఞతలు, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# నాగపుట్ట దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



**నెరడిగొండ ఆగస్టు11(జనంసాక్షి):** మండలంలోని బోథ్‌ఎక్స్ రోడ్డు 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ప్రకృతి సిద్ధంగా వెల సిన పురాతనమైన నాగపుట్ట దేవాలయని భక్తులు అలంకరించారు. ఇక్కడ ప్రతివారం పలు ప్రాంతాల నుండి భక్తులు దర్శనానికి పోటెత్తుతున్నారు.ఇందులో భాగంగా సోమవారం రోజున అలయ పూజారి మేధిలి రవి స్వామి,వేద పండితులు నమలికొండ సంతోష్ కుమార్ శర్మ,దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నాగదేవత విగ్రహం తోపాటు శ్రీ శివపంచాయతనము,శ్రీ అభయాంజనేయ స్వామి,నవగ్రహా విగ్రహాల ప్రతిష్ఠాపన శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పలువు భక్తులందరూ విగ్రహదాతలు ప్రతిష్ఠాపన మహోత్స వానికి, అన్నదాన కార్యక్రమమునకు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెలించుకున్నారు.ఈ కార్యక్రమంలో వాగ్దరి గ్రామంతోపాటు చుట్టూ ప్రక గ్రామస్తులు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సొంతింటి కల ప్రజా ప్రభుత్వంలో సకారం

- జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు



**పర్వతగిరి, ఆగస్టు 11 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు ఆదేశాల మేరకు మండలంలోని సోమారం గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ గృహాలకు సోమవారం ముగ్గు పోసి అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ గృహాలు అందించబడతాయని, మంజూరు కాకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కె ఆర్. నాగరాజు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లావుద్య లచ్చు నాయక్, మండల మైనార్టీ నాయకులు ఎస్ కె. అక్బర్ పాషా, పంచాయతీ కార్యదర్శి మమత, సిబ్బంది యాక నారాయణ, వేమూనూరి సదానందం గ్రామ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ఆనంద్ మహేంద్ర చేతుల మీదుగా పట్టా ప్రధానం



**పరకాల, ఆగస్టు 11 (జనంసాక్షి):** పరకాల పట్టణానికి చెందిన చందుపట్ల సుహాసిని రాఘవరెడ్డి దంపతుల కుమారుడు సాయి శ్రీమంత్ రెడ్డి ప్రముఖ పారిశ్రామికవేత్త మహేంద్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ఆనంద్ మహేంద్ర చేతుల మీదుగా తన మాస్టర్ డిగ్రీ పట్టాను అందుకున్నారు. హైదరాబాదు లోని మహేంద్ర విశ్వవిద్యాలయం నాలుగవ స్నాతకోత్సవ కార్యక్రమంలో భాగంగా మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ విభాగంలో పట్టాను పొందారు. ఈ సందర్భంగా పలువురు సాయి శ్రీమంత్ రెడ్డిని అభినందించారు.

## ప్రజల ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలి

- ఎస్పీ కిరణ్ ఖరే



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పోలీసులు ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 19 మంది పిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ తెలుసు కుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా దివాస్‌లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు.

## పాఠశాలకు మైక్ సెట్ విరాళం



దస్తూరాబాద్, ఆగస్టు 11 (జనంసాక్షి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు సోమవారం మండలంలోని విశ్రాంత ఉపాధ్యా యులు, గ్రామ పెద్దలు కలిసి 50 వేల రూపాయల మైక్ సెట్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు ఈ మైక్ సెట్ అవసరమవుతుందని తెలిపారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారి గంగాధర్, ఉపాధ్యాయులు శరీన్,రవీందర్,శ్రీనివాస్, సత్తన్న, దేవరావు,సంజీవ్,కొమురయ్య,స్వప్నవిద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



**తొర్రూరు , ఆగస్టు 11 (జనంసాక్షి):** నులిపురుగుల నివారణతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తొర్రూరు ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ పగిడిపాటి సుగు ణాకర్ రాజు పేర్కొన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కమిషనర్ శ్యాంసుందర్, వైద్యాధికారి జ్వలితతో కలిసి డాక్టర్ సుగుణాకర్ రాజు మాట్లాడారు. ఏడాది పిల్లల నుంచి 19 ఏళ్ల వరకు ప్రతి ఒక్కరు ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజల్ మాత్రలను వేసుకోవాలని కోరారు.ఈ మాత్రలతో పిల్లల్లో నులి పురుగుల సమస్య, రక్తహీనత, బుద్ధి మాంద్యం, చదువుల పట్ల ఏకాగ్రత పెంపొందుతుందన్నారు.1నుంచి2 సంవత్స రాల్లో పు పిల్లలకు 200 మి.గ్రా, 3నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు 400 మి.గ్రా ఆల్బెండ జోల్ మాత్రలు మధ్యాహ్నం భోజనం వేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో హెచ్ఎం జెల్ల లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ తోనే సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 11(జనంసాక్షి):** నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ధర్మారం జెడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ నులిపురుగుల మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా లక్ష 98 వేల మంది బాలబాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్నట్లు చెప్పారు. ఒక సంవత్సరం నుండి 2సం.లు ఉన్న చిన్నారులకు భోజనం తరువాత అల్బెండజోల్ సగం మాత్ర, 3సం.ల నుండి 19సం.ల విద్యార్థులకు అల్బెండజోల్ ఒక మాత్ర భోజనం అనంతరం అందజేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ నులి పురుగుల వల్ల ఆహారం జీర్ణం కాకపోవడం, రక్తహీనత తదితర అనారోగ్య రుగ్మతలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మాత్రలను తీసుకోవడం వల్ల రక్తహీనతను నిర్మూలించడంతో పాటు పోషకాహార ద్వారా వ్యాధినిరోధక శక్తిని మెరుగుపడుతుందని కలెక్టర్ కు తెలిపారు. ముఖ్యంగా ఈ నులిపురుగులు అపరిశుభ్రమైన ఆహారం, కలుషితమైన నీరు తీసుకోవడం వల్ల నులిపురుగులు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలిపారు. ఒకవేళ ఈ రోజు పొరపాటున సదరు మాత్రలు తీసుకొని వారికి మరల ఆగస్టు 18వ తేదిన మాప్-అప్ కార్యక్రమం ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ మాత్రల వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. జ్వరం ఉన్నపుడు ఈ మాత్రలను తీసుకోకూడదన్నారు. అనంతరం ధర్మారం అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి చిన్నారులకు స్వయంగా అల్బెన్డజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, డిడబ్ల్యూ ఓ రాజమణి, డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్ డాక్టర్, కొమురయ్య,తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపిడిఓ శ్రీనివాస్, డాక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మరిపెడ హైస్కూల్లో నులిపురుగుల నివారణ దినోత్సవం



**మరిపెడ ఆగస్టు 11 (జనంసాక్షి):** ఆగస్టు 11న జాతీయ నులిపురుగుల (పేగు పురుగు) నిర్మూలనా దినోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరావు ఆధ్వర్యంలో మరిపెడ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది చే పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలను వేయడం జరిగింది. మాత్ర నేరుగా మింగరాదని, చప్పరించాలని లేదా బాగా నమిలి మింగాలి అని చెప్పారు. 11వ తేదీన అందుబాటులో లేని వారికి 18న కూడా పంపిణీ చేస్తామని అన్నారు. ఈ మేరకు పాఠశాలలో ఆల్బెండజోల్ ప్రాధాన్యాన్ని తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ కడుపులో నులిపురుగులతో పిల్లలు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. వాటిని దూరం చేసి చిన్నారులు ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పాటిస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణం, మురుగు కాలువులు, నిలువ నీరు, జంతువుల మలం తదితర వాటి వల్ల నులిపురుగుల వ్యాప్తి జరుగుతుంది. నిల్వ ఉన్న, చెడిపోయిన ఆహారం, సరిగ్గా ఉడకని మాంసం వంటివి కూడా నులిపురుగుల వ్యాప్తికి కారణమవుతున్నాయి. తీపి, పిండి పదార్థాలు ఎక్కువగా తీసుకున్నా, మలబద్దకం ఉన్నా నులి పురుగులు తయారవుతాయి. పిల్లలు మట్టిలో అడుకున్నప్పుడు గోళ్లలో మట్టి ఉండిపోతుంది. చేతులను నోట్లో పెట్టుకోవడం, కడగకుండా భోజనం చేయడం వంటి కారణాలతోనూ నులిపురుగులు సోకుతాయని అన్నారు. కాబట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఆహారం తీసుకునే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడగాలి. పిల్లలకు దీనిపై అవగాహన కల్పించాలి. చేతి గోళు ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. గోళ్లలో మట్టి లేకుండా చూసుకోవాలి. పాదరక్షలు ధరించాలి. అప్పుడే తయారు చేసిన వేడి ఆహారం తీసుకోవాలి. పిల్లలకు తీపి పదార్థాలు, చాక్లెట్లు, మలబద్ధ కానికి కారణమయ్యే మైదా పిండి వంటలు బాగా తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ , సీనియర్ ఉపాధ్యాయులు బయగాని రామ్మోహన్, ఉపాధ్యాయ బృందం జనార్ధన చారి, దేవుల, శ్రీశైలం, ప్రకాష్, ప్రసాదరావు, రమేష్ రెడ్డి, లెనిన్, బాబురావు, సారయ్య, జహీదా, సురేష్, రాజకుమారి, అనిత, సుధ, మంజుశ్రీ, పద్మ, శంకర్, వైద్య సిబ్బంది నర్సు బాయ్, శ్రీదేవి, శోభ, అనసూర్య విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపనకు శంకుస్థాపన



**నస్పూర్ (జనంసాక్షి):** పట్టణంలోని ఆర్ కే.6 కొత్త రోడ్డు వద్ద పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ట,ఆలయ విస్తరణ భూమి పూజ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పోచమ్మ ఆలయం శిథిలావస్థకు చేరడంతో భక్తుల కోరిక మేరకు విగ్రహ ప్రతిష్టాపన,ఆలయ విస్తరణ చేయాలని కాలనీవాసులు నిర్ణయించారని,సోమవారం విగ్రహ ప్రతిష్టాపన ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన చెన్నూరు వాస్తవ్యులైన వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరగిందని తెలిపారు.ఆలయ నిర్మాణానికి అయ్యే ఖర్చు దాతల నుండి సేకరించి నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అదేవిధంగా స్థానికేతరులు కూడా ఆలయ నిర్మాణానికి చొరవ చూపి తోచిన సహాయాన్ని అందించాలని కోరారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

అప్క గజేందర్



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 11 , (జనంసాక్షి):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ను ప్రభుత్వం కల్పించాలని నవ సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అప్క గజేందర్ యాదవ్ అన్నారు. సోమవారం నిర్మల్ ప్రెస్ క్లబ్ భవన్ లో బీసీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం విద్య, ఉద్యోగ, రాజకీయం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. కానీ ఆ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా అసత్య ప్రచారాలతో ద్వంద్వ వైఖరిని అవలంబిస్తుందంటూ.. విమర్శించారు. ఇప్పటికైనా పార్లమెంట్ లో బిజెపి ప్రభుత్వం బీసీల బిల్లును ఆమోదించాలన్నారు. లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రిజర్వేషన్ల కొరకు బీసీలంతా ఏకం కావలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.అనంతరం నవ సంఘర్షణ సమితి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడుగా డాక్టర్ సయ్యద్ అక్తర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఫిరోజ్, సెక్రెటరీ వెంకటేష్ ,తదితరులు పాల్గొన్నారు .

# రోడ్డుకు మరమ్మత్తులు చేయించిన నాయకులు



**బెల్లంపల్లి, ఆగష్టు 11, (జనంసాక్షి):** బెల్లంపల్లి నియోజకవర్గం వేమనపల్లి మండలం నీల్వాయి రోడ్డు గుంతలమయం అయి కంకర తేలి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకొనడంతో సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశానుసారం వేమనపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీతో కలిసి మాజీ జడ్పీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్ రోడ్డుకు మరమ్మత్తులు చేయించారు. కోటపల్లి మండలం మల్లంపేట నుంచి నీల్వాయి వరకు కంకర, మెటల్ తో రోడ్డు మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్బంగా మాజీ జడ్పీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్ మాట్లాడుతూ అటవీ శాఖ అనుమతులు రాక చాలా సంవత్సరాలుగా రోడ్డు వేయకుండా ఉన్నందున గుంతలు ఏర్పడి ప్రయాణికులు, వాహనదారులు నానా రకాలుగా ఇబ్బందులు ఎదురుకుంటున్నారని అన్నారు. అట్టి కష్టాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డుకు అటవీశాఖ అనుమతులు ఇవ్వడానికి కావాల్సిన 9 కోట్ల రూపాయల నిధులను ఆర్ అండ్ బీ శాఖ నుండి అటవీశాఖకు ఇప్పించండానికి నిధులు మంజూరు చేయాలనీ ఇటీవలే బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నవించామన్నారు. అటవీశాఖ అనుమతులు వచ్చే వరకు రోడ్డును తాత్కాలికంగా మెటల్, కంకర, చిప్స్ మిక్సర్ తో రోడ్డుపైనా ఉన్న గుంతలు పూడ్చి రోడ్డును తాత్కాలికంగా మరమ్మత్తులు చేయిస్తున్నామని అన్నారు. త్వరలోనే రోడ్డును పూర్తి స్థాయిలో వేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఆకుల లింగా గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఒడిలా రాజన్న, మాజీ సర్పంచ్ లు గాలి మధు, తోకల రాంచందర్, మోర్ల రమేష్, ఇగురం జగన్, ఆవులమారి పున్నం, కొమురం రమేష్, భగవంతు, మాజీ కో అప్టెడ్ సభ్యులు జహీద్ అలీ, నాయకులు చెన్నూరి పురుషోత్తం, చెందు, రఫీయొద్దిన్, అబ్దుల్ ఖాన్, అన్వర్ అలీ, మధుసూదన్, కుమ్మరి శ్రీను, మంత్రి రమేష్, కొట్రంగి శ్రీనివాస్, నాయిని శంకర్, పాయిల లచ్చన్న, ఖైరి రాజేష్ గౌడ్, తాళ్ళ వెంకటేష్, తిరుమలేష్, శ్రీశైలం, గట్టయ్య, కుర్రు ఆంజనేయులు, తోకల హనుమంత్, కోటారీ మహేందర్, దొబ్బల పోశం తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

**పెద్దవంగర ఆగష్టు 11(జనంసాక్షి):** వీధి కుక్కలు దాడి చేసి చిన్నారిని గాయపరిచిన సంఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరలో సోమవారం జరిగింది.. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద వంగరకు చెందిన మందపూరి సతీష్ కూతురు మందపూరి ఆరాధ్య తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండవ తరగతి చదువుతుంది. రాఖీ పండగ సెలవులు రావడంతో పెద్ద వంగర ఎక్స్ రోడ్డు వద్ద తన తాతయ్య ఇంటికి ఆమె తల్లితో కలిసి వెళ్లింది. ఆదివారం భోజనం చేసిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడానికి ఆరాధ్య బయటకు వచ్చింది. ఆ సమయంలో అక్కడే కాచుకుని ఉన్న వీధి కుక్క ఒక్కసారిగా ఆమెపై దాడి చేసింది. తమ కుడి కాలిపై తీవ్ర గాయాలు చేసింది. దీంతో ఆరాధ్య కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు బయటకు వచ్చి, వీధి కుక్కలను తరిమికొట్టి చికిత్స నిమిత్తం ఆరాధ్యను మహబూబాబాద్ లోని ప్రభుత్వ దావకానకు తరలించారు. ప్రస్తుతం ఆరాధ్య క్షేమంగానే ఉందని తల్లిదండ్రులు తెలిపారు. ఇటీవల వీధి కుక్కల వరుస దారులతో గ్రామస్తులు బెంబేలు ఎత్తుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, వికలాంగులు బాటసారులు తమ లక్ష్యంగా వీదికలు చెలరేగిపోతున్నాయి. చిన్నారులు, వృద్ధులు బయటికి రావాలంటేనే జంకు తున్నారు. మనసులోనే కాకుండా జంతువులను కూడా వీడు కుక్కలు ఇటీవల తీవ్రంగా గాయపరు స్తున్నాయి.

ఇప్ప టికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## కేంద్ర ప్రభుత్వం బీసీల పట్ల ద్వంద వైఖరి మానుకోవాలి

- బీసీలకు 42% పార్లమెంట్‌లో ఆమోదం తెలపాలి
- సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండి దావూద్




**ఏటూరునాగారం,ఆగష్టు 11(జనంసాక్షి):** జిల్లా కమిటీ పిలుపులో భాగంగా ఏటూరునాగారంలో డిప్యూటీ తాసిల్దార్ రాహుల్ కు మెమోరాండం సమర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి దావూద్ విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేస్తే 56% పైచిలుకు బీసీలు ఉన్నట్లు నిర్ధారణకు వచ్చిందని అందులో 42 శాతం అసెంబ్లీలో ఆమోదం తెలిపి గవర్నర్ ఆమోదం కోసం పంపగా గవర్నర్ తేల్చకపోగా కేంద్రం ఆమోదం కోసం పంపితే తేల్చకుండా కేంద్రం కూడా కులగనన నిర్వహిస్తామని చెబుతూనే 42% ఆమోదం తెలపకుండా ద్వంద వైఖరి ఆలంబిస్తుందని కేంద్రంపై మండిపడ్డారు.ఇప్పటికే ముస్లిం ఉప కులాలకు ఐదు శాతం రిజర్వేషన్ అమలవుతుంటే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు ఇప్పుడేదో ఐదు శాతం ఇస్తానట్లు ముస్లింలను దృష్టిలో పెట్టుకోవడం ముస్లింల పట్ల వారికున్న నీచ బుద్దేదో ఇప్పుడు తేటతెల్లమవుతుందని దీన్ని సాకుగా చూపిస్తున్న కేంద్ర ప్రభుత్వం మేము కుల గనన నిర్వహిస్తామనడంలో ఆంతర్యం ఏమిటని బిజెపి వాళ్లు సర్వే నిర్వహిస్తే 56 కు బదులుగా ఇంకేమైనా తక్కువ శాతం తెలంగాణలో వస్తదా? తెలుసుకోవాలని బిజెపి నాయకులకు దావూద్ హితవు పలికాడు.దేశ ప్రధాని నే బీసీ అయి ఉండి దేశ ప్రజల పట్ల అందులో ప్రత్యేకంగా తెలంగాణ పట్ల 42% రిజర్వేషన్ ఇవ్వడానికి పార్లమెంట్లో ఆమోదం తెలపడానికి ఇంత నిరంకుశంగా వ్యవహరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కార్యక్రమంలో గడ్డం కొండల్, దామోదర్, రఘుపతి, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి



**బెల్లంపల్లి, ఆగష్టు 11, (జనంసాక్షి):** పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాల ని ఎంఎల్హెచ్పి కావ్య అన్నారు. సోమవారం ఆమె బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం కుశ్నపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలోని విద్యార్థు లకు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నులి పురుగులను నివారించే ఆల్బెం డజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సంవత్సరానికి రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు.

## తనిఖీ చేసి సూచనలు అందించిన సబ్ కలెక్టర్



**బెల్లంపల్లి, ఆగష్టు 11, (జనంసాక్షి):** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం నూతన సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశిం చారు. వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. రైతుల పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, పెండింగ్ లో ఉంచవద్దని అన్నారు. ఈసందర్భంగా ఆయన మీడియా మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే కార్యాలయా న్ని తనిఖీ చేసినట్టు వివరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించి నందున అన్ని మండలాలు సందర్శించి క్షేత్రస్థా యిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ ప్రకాష్, గిర్ధవర్ సులోచన రాథోడ్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# చిలువేరు సాగర్ కుటుంబానికి

## ఎమ్మెల్యే దొంతి పరామర్శ



**వరంగల్ ప్రతినిధి ఆగష్టు 11 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిలువేరు సాగర్‌కు నివాళులర్పించి మృతుడి కుటుంబాన్ని పరామర్శిం చిన నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి కుటుంబానికి సాను భూతిని తెలిపి కుటుంబానికి అండగా ఉంటా నన్నారు. మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన చిలువేరు నారాయణ చిన్న కుమారు డు సాగర్ మంచిర్యాల దగ్గర రోడ్డు ప్రమాదంలో మర ణించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న శాసనస భ్యులు ఆ కుటుంబాన్ని పరామర్శించి పదివేల10వేలు రూపాయలు ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో నర్స ంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసి డెంట్లు చెన్నూరి కిరణ్ రెడ్డి, ఓలిగే నర్సింగరావు, క్లస్టర్ ఇంచార్జ్ ఆవుల నరసింహారెడ్డి, మండల కార్యదర్శి అమ్మ రోహిత్, గ్రామ పార్టీ అధ్య క్షులు రాస చేరాలు, కంత్రి స్వామి, తొగర్రాయి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక పట్టివేత



**టేకుమట్ల ఆగష్టు 11 (జనంసాక్షి):** టేకుమట్ల తహసీల్దార్ ఆదేశాల మేరకు రామకిష్టాపూర్ (వి) గ్రామ శివారులోని ఇండ్ల సముదాయలలో ఎలాంటి అనుమతులు లేకుండా డంపు చేయబడిన 70ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి పంచనామా నిర్వహించి స్థానిక పంచాయతీ కార్యదర్శికీ, రామకిష్టాపూర్ (వి) అప్పగించనైనది. ఇట్టి విషయం లో మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా సీజ్ చేయబడిన 70 ట్రాక్టర్ల ఇసుకను తేదీ. 12.08.2025 మంగళవారం రోజున ఉదయం 11.00గంటలకు తహసీల్దార్ కార్యాలయం, టేకుమట్ల నందు వేలం పాట నిర్వహించడానికి నిర్ణయించెనైనది. కావున ఆసక్తి గల వారు ఎవరైనా వేలంపాటలో పాల్గొనవలసినదిగా కోరనైనది ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతు బీమాకు ధరఖాస్తు చేసుకోవాలి

- ఏఈఓ రాధిక




**పాలకుర్తి, ఆగష్టు 11(జనంసాక్షి):** గతంలో ధరఖాస్తు చేయని ఐదెకరాల లోపు భూమి కలిగి ఉన్న రైతులకు మరోకసారి రైతు బీమాకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ నెల 13 వరకు రైతు బీమా కోసం ధరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి జాటోత్‌రాధిక తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో పాలకుర్తి, బమ్మెర, గ్రామాల రైతుల నుండి రైతు బీమా అప్లికే షన్లు తీసుకున్నారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి జూన్ 5 నాటికి కొత్త పట్టాదార్ పాస్ పుస్త కం పొందిన రైతులందరు అర్హులని తెలిపారు. 18 ఏండ్ల నుంచి 59 సంవత్సరాల వయసు గల రైతులు రైతు బీమాకు అర్హులని తెలిపారు. కొత్త రైతులు నమోదు, పాత రైతుల రెన్యూవల్ చేస్తారని తెలిపారు. అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అధికలోడుతో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్



**టేకుమట్ల ఆగస్టు 11 (జనంసాక్షి) :** టేకుమట్ల మండలంలోని తహసిలాద్ర్ ఆఫీస్‌లో సూపర్ డెంట్ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ మాట్లాడుతూ టేకుమట్ల మండలంలోని చలి వాగు ప్రవహిక ప్రాంతాల్లో ఇసుకను ఇందిరమ్మ ఇండ్ల కోసం పర్మిషన్ తో తరలిస్తున్నారు తరలించే క్రమంలో టాక్టర్ యాజమాన్యం ఇష్టానుసారంగా అధికలోడుతో అధికారులు నిర్ణయించిన ధరలకు అనుగుణంగా కాకుండా వాళ్ళ ఇష్టమైన ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు ఒక ట్రిప్ పర్మిషన్ ఉంటే చాలు రోజుకు ఎన్ని ట్రిప్పులు అయినా కొట్టుకుంటున్నారు అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనపడుతుంది నియోజకవర్గం పరిధిలో కాకుండా తమ ఇష్టానుసారంగా పరకాల హనుమకొండకు తరలిస్తున్నారు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో తరలిస్తున్న అక్రమ ఇసుక రవాణా అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామని ఆయన తెలియజేశారు సిపిఐ ఎంఎల్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పోలీసులు ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 19 మంది పిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా దివాస్‌లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగులో లేకుండా ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకోవాలని, ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు.

## నేషనల్ డివార్మింగ్ డే




**మంగపేట ఆగస్ట్ 11 (జనంసాక్షి) :** నేషనల్ డివార్మింగ్ డే సందర్భంగా మండలంలో మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయసు గల వారికి ఆల్బెండజోల్ 400 ఎంజి టాబ్లెట్స్ వేయడం జరిగిందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలలోని విద్యార్థినీ విద్యార్థులకు వేయడం జరిగింది వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నులిపురుగుల వలన రక్తహీనత ఏర్పడుతుందని అలా రక్తహీనత జరగకుండా ఉండాలంటే తప్పని సరిగా విద్యార్థుల విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మంగపేట వైద్యాధికారిని డాక్టర్ అఖిల, డాక్టర్ గొప్పగాని తరుణ్, చుంచుపల్లి వైద్యాధికారిణి డాక్టర్ యమున, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారిని పరామర్శించిన సింగపురం ఇందిరా



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 11 ( జనంసాక్షి ) :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం చిల్పూర్ మండలం లోని చిన్న పెండ్యాల ఎస్సీకాలనీ చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జిడి కోర్నెల్ మనవరాలు చిన్నారి జీడి నిష్క జ్వరంతో హన్మకొండలోని ఓ ప్రవేట్ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్నది. విషయం తెలుసుకొన్న స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సింగపురం ఇందిరా సోమవారం రోజున చిన్నారి జీడి నిష్కా బంధువులతో ఫోన్లో మాట్లాడి చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై తెలుసుకున్నారు.వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి మనో ధైర్యాన్ని కల్పించారు. వైద్యులతో మాట్లాడి చిన్నారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ఆలయంలో అసలేం జరుగుతుంది

- **అవినీతి ఆరోపణలపై అధికారుల పర్యవేక్షణ కరువు**
- **దీని వెనక ఉన్న సూత్రధారి ఎవరు**
- **ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్**



**కాళేశ్వరం , ఆగస్టు 12 ,( జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం ఆలయ సిబ్బందిపై వస్తున్న ఆరోపణలపై ఎమ్మార్పీఎస్ మహాదేవపూర్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచి అంచలంచెలుగా ఆలయం అభివృద్ధి చెందుతున్న క్రమంలో కాళేశ్వరం ఆలయం సిబ్బందిపై సోషల్ మీడియా మరియు పలు పత్రికల్లో వార్త కథనాలు, ఆరోపణలు వస్తున్న దేవాదాయ శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు.ఆలయాన్ని భ్రష్టు పట్టిస్తున్న ఇక్కడున్న సిబ్బంది ఎంతో భక్తిశ్రద్ధలతో విధులు నిర్వహించాల్సింది పోయి తమకు ఇష్టం వచ్చిన రీతిలో బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. కాళేశ్వర ముక్తేశ్వర ఆలయాన్ని అధికారులు పట్టించుకోకపోవడం పై ఆలయం యొక్క ప్రతిష్టలు దిగజార్చడానికి పూనుకున్నారా అనే విమర్శలకు దారితీస్తుందని బెల్లంపల్లి సురేష్ ఆరోపించారు . సుదూర ప్రాంతాల నుండి ఎంతో మంది భక్తులు తమ కోరికలను తీర్చుకోవడానికి మొక్కులను సమర్పించడానికి ఆలయానికి వస్తున్న తరుణంలో, ఆలయ అభివృద్ధి మెరుగు పడుతున్న క్రమంలో ఆలయ సిబ్బందిపై ఆరోపణ వస్తున్నా చర్యలు తీసుకోకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. అదే కాకుండా ఏకాధిపత్యం చెలాయిస్తున్న ఆ అధికారిని ఎందుకు సస్పెండ్ చెయ్యరు అని డిమాండ్ చేశారు. ఆలయం పేరు ప్రతిష్టలను దిగదార్చడానికి పూనుకున్న ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కొందరు ఆలయ సిబ్బంది కిందిస్థాయి వర్కర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని దీనిపైన కూడా ఉన్నత అధికారులు దృష్టి సారించి కాళేశ్వరం ప్రతిష్టను దిగజార్చకుండా దేవస్థానం యొక్క అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. ఉన్నత అధికారులు ఇప్పటికైనా తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ డిమాండ్ చేశారు.

# ఆల్బెండజోల్ మాత్రతో రక్తహీనతను నిర్మూలిద్దాం

- **ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు**



**పరకాల, ఆగస్టు 11 (జనంసాక్షి):** జాతీయ నులిపురుగుల నివారణోత్సవం లో భాగంగా సోమవారం రోజున పరకాల ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు పట్టణంలోని హై స్కూల్, ఉర్దూ పాఠశాల సందర్శించారు. పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ టాబ్లెట్లను వేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రము రాయపర్తి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పిల్లలు మరీ ముఖ్యంగా 2 నుండి 19ఇయర్స్ పిల్లలు సులభంగా నులిపురుగుల బారిన పడే అవకాశం ఉంటుందని చిన్నపిల్లలు, పెద్దవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సంవత్సరంలో రెండు సార్లు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రెండు సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వరకు వయస్సు ఉన్న వారికి ఉచితంగా ఒకే ఒక ఆల్బెండజోల్ టాబ్లెట్ ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్వాడి స్కూళ్లలో ఉచితంగా పంపిణీ చేస్తుందని, వాటిని తప్పక సేవించి నులిపురుగుల బారిన పడకుండా ఉండి రక్తహీనతకు గురికావద్దని అన్నారు.రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్య పిల్లలకు హ్యాండ్ వాష్ టెక్నిక్స్ గురించి , రక్తహీనత వల్ల కలిగే దుష్పరిణామాలు గూర్చి పిల్లలకు వివరించారు. సంవత్సరంలో రెండు సార్లు ఆల్బెండజోల్ టాబ్లెట్లు తప్పక వేసుకొని రక్తహీనతకు గురికాకుండా చురుకుగా ఉంటూ విద్యను అభ్యసించాలన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్లు, టీచర్లు, వైద్య సిబ్బంది డాక్టర్ మాధవి, రాజకుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి సాంబయ్య, పర్యవేక్షకులు,ఆరోగ్య కార్యకర్తలు రజిత, విద్యాసాగర్,స్వాతి,ఏ ఎన్ ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకుంటా



**మంగపేట ఆగస్ట్ 11(జనంసాక్షి) :** బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కొరకు నిరంతరం కృషిచేస్తున్న ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వారికి ఎల్లప్పుడు అండగా నిలుస్తానని బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ జడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. సోమవారం మండల పర్యటనలో భాగంగా ఇటీవల వివిధ గ్రామాల్ల ఇతరత్రా కారణాలరీత్యా మరణించిన బాధిత కుటుంబాలను బిఆర్ఎస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వారి వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా కమలాపురం గ్రామానికి చెందిన బోయి నారాయణ కుటుంబానికి పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన పరమాత్మల సమ్మయ్య అనే రైతు గడ్డి మందు త్రాగి మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే నరసింహసాగర్ గ్రామంలో ఇటీవల మరణించిన బొల్లి కుమార్, పొర్ల ఐలమ్మ, బుచ్చంపేట గ్రామానికి చెందిన బూర్గుల అభిషేక్, దీకొండ శేషు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయాలను అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, జిల్లా నాయకులు తుమ్మ మల్లారెడ్డి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బడిశా నాగరమేష్, మల్లూర్ దేవస్థానం మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, జిల్లా నాయకులు కుర్బన్ అలీ, ఎట్టి జగదీష్, చిట్టీమల్ల సమ్మయ్య, మండల నాయకులు చిలకమర్రి రాజేందర్, చల్లగురుగుల తిరుపతి, అయూబ్, రవి, మాదరి రామయ్య, జీగాట శ్రీనివాస్, నాగేశ్వరావు, ఉడుగుల శ్రీనివాస్ యాదవ్, యాగ్గడి అర్జున్, ఏటూరునాగారం మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి, సోషల్ మీడియా వారియర్స్ గుడివాడ శ్రీహరి పాల్గొన్నారు.

## ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ నులి పురుగు నివారణ మాత్రలు వేయాలి



**భీమదేవరపల్లి:ఆగస్టు 11(జనంసాక్షి) :** నులి పురుగుల సోకడం వల్ల కలిగే లక్షణాలు చికిత్స నివారణా గురించి జాతీయ నులి పురుగులు దినోత్సవం ముఖ్య కార్యక్రమాన్ని డాక్టర్ ప్రదీప్ అన్నారు.భీమదేవరపల్లి మండలం ములుకనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్యధికారి డా.ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో పలుజిప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు,కళాశాలల విద్యార్థులకు,ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాటమాట్లాడు ఒకటి నుండి19సంవత్సరాల లోపు పిల్లలందరికీ నులి పురుగు నివారణ మాత్రంలు వేసి పురుగులను పూర్తిగా నిర్మూలించడానికి ఆల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.ఆల్బెండజోల్ మాత్రలు ఎటువంటి హాని చేయదని ప్రతి ఆరు నెలలకు ఒకసారి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల కడుపులో పెరిగే నట్టలను పూర్తిగా నివారించే అవకాశం ఉంటుందన్నారు.పిల్లలు ఆరుబయట వట్టికాలతో ఆడుకోవడం, మట్టిలో ఆడి చేతులు కడుక్కోకుండా భోజనం చేయడం,పరిసరాలను పరిశుభ్రంగా ఉండకపోవడం వల్ల నులిపురిగులు తయారవుతాయని అన్నారు.ఈనెల 18 తారీకు మరో సారి వేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా,మౌనిక,సూపర్వైజర్లు రాజయ్య,రత్న భారతి,సిస్టర్లు అనితకుమారి,కళ,వనజ,స్వరూప, హెల్త్ అసిస్టెంట్ రాజు,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు అరెస్టు 250 కిలోల కాపర్ వైర్ స్వాధీనం

- ములుకనూరు పోలీసులను అభినందించిన కాజీపేట ఏసీబీ ప్రశాంత్ రెడ్డి...



**భీమదేవరపల్లి:ఆగస్టు 11(జనంసాక్షి) :** జల్సాల కోసం ట్రాన్స్ఫర్మర్లే టార్గెట్ కాపర్ వైర్ దొంగిలించిన దొంగలను సోమవారం రోజున ములుకనూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.భీమదేవరపల్లి మండలం ములుకనూరు పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి,ఎల్కతుర్తి సీఐ పులి రమేష్,ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, సాయిబాబు,ఉన్నారు. ఈ సమావేశంలో ఏసిపి ప్రశాంత్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమదేవరపల్లి క్రాస్ వద్ద తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ సమయంలో వారి వద్ద చేతి గ్లౌజులు,పనార్లు, ఇనుప రాడ్లు లభించాయి. విచారణలో నిందితులు బండి కుమార్ (36, సైదాపూర్), బండి సతీష్ (25) గతంలో రామగుండం, కేశవపట్నం మండల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనం చేసి పగలగొట్టిన కేసులో జైలు శిక్ష అనుభవించినట్లు బయటపడింది. విడుదలైన తర్వాత కూలి పనులు చేస్తూ, మళ్ళీ డబ్బు కోసం నేర మార్గం ఎంచుకున్నట్లు తెలిపారు.ఇద్దరూ కలిసి ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, వేలేరు, ధర్మసాగర్, అయినవోలు, చిల్పూరు, అక్కన్నపేట, హుజూరాబాద్, కేశవపట్నం మండల పరిధిలోని గ్రామాల్లో మొత్తం 27 ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు మోటార్లను పగలగొట్టి కాపర్ వైర్లు దొంగిలించారని ఒప్పుకున్నారు. ఈ వైర్లు, మోటార్లను ముల్కనూర్‌కు చెందిన రుద్రాక్ష తిరుపతికి విక్రయించి వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేశారని తెలిపారు. సోమవారం పోలీసులు రుద్రాక్ష తిరుపతి వద్ద దొంగిలించిన కాపర్ వైర్లు, అల్యూమినియం వైర్లు, కరెంటు మోటార్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 250 కిలోల కాపర్ వైరు, కరెంటు మోటార్, టీవీ ఎక్సెల్ బండి, చేతి గ్లౌజులు, పనాలు, స్క్రూ డ్రైవర్లు, ఇనుప రాడ్లు స్వాధీనం చేసుకున్నరు.వాటి విలువ రెండు లక్షల 50 వేల ఉంటుందని కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తెలిపారు.వీరిపై తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో 32 కేసులు నమోదైనట్లు తెలిపారు.మ్మొత్తంగా 53 కేసుల్లో నిందితులుగా తేలిందన్నారు. కాపర్ వైర్ దొంగలపై కేసు నమోదు చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు ఏసిపి తెలిపారు. కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి వీరి పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ముల్కనూర్ ఎస్సై సాయిబాబు, కానిస్టేబుల్స్ మోహన్ బాబు, సదానందం, నాగేశ్వరరావును ఏసీపీ అభినందించారు.

## నులిపురుగు రహిత సమాజాన్ని నిర్మించుకోవాలి

- వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రతను పాటించాలి
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి ఆగస్టు 11 (జనంసాక్షి):** నులిపరుగు రహిత సమాజాన్ని నిర్మించుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సూచించారు. జాతీయ నులి పురుగు నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినీలకు ఆల్బెండొజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకొని విద్యార్థినిలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని అన్నారు. ఆల్బెండొజాల్ మాత్రలతో అనారోగ్య సమస్యలు కుదుటపడతాయని తెలిపారు. మండల కేంద్రంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని పదివేల ఎనిమిది వందల యాభై ఒక్క మంది విద్యార్థినీ విద్యార్థులకు నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండొజాల్ మాత్రలను అందించామని వైద్యాధికారి సిద్ధార్థ రెడ్డి తెలిపారు. తప్పిపోయిన విద్యార్థులకు ఈనెల 18న అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్వప్న, ఎంపీడీవో రవీందర్, ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్ లు సుంద రాజా స్వరూప, భైరపాక నవీన, వైద్య సిబ్బంది రమణమ్మ, లిల్లీ దేబోరా, శ్రీనివాసరెడ్డి, ఇంద్రాణి, స్రవంతి, ఆర్ వి ఎస్ కే టీ వైద్యులు డాక్టర్ లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం వాల్ పోస్టర్ ఆవిష్కరణ




**మరిపెడ ఆగస్టు 11 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రం లోని, స్థానిక తహాశీల్దార్ కృష్ణవేణి, పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజకుమార్, ఎంపీడీఓ వే ణుగోపాల్ రెడ్డి ఎస్సై బిసతీష్,లు ప్రారంభించారు. కా ర్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్,శరత్ చంద్ర గౌడ్, ఎంపీడీఓ కార్యాలయంలో, , ఎంపీఓ, సోమ్లాల్, పాల్గొ నగా అధికారులచే ఆవిష్కరించిన అనంతరం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద బోయిన ఐలమల్లు, బురహాన్ పురం, గ్రామ కాంగ్రెస్ పార్టీ లీడర్ ,మ చ్చ వెంకట నరసయ్య, మరిపెడ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ నాయక్, హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరగనున్న రాష్ట్ర రెండవ మహాసభ, తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు ఈ కార్యక్ర మంలో తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం మరిపెడ మండల అధ్యక్షులు చింత వెంక న్న కార్యవర్గ సభ్యులు, తప్పెట్ల సైదులు, చింత దిలీప్, తదితరులున్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

- సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**రామకృష్ణాపూర్, ఆగస్ట్ 11 (జనంసాక్షి):** ఈ నెల 20 నుండి 22 వ తేదీ వరకు మేడ్చల్ లో జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మహాసభల గోడప్రతులను నాయకులతో కలిసి సోమవారం విడుదల చేసి మాట్లాడారు. ఈ మహాసభలకు పార్టీ జాతీయ కార్యదర్శి మాజీ ఎంపి డి.రాజా ముఖ్య అతిథులుగా హాజరవుతారని, అలాగే 33 జిల్లాల నుండి 600 మంది ప్రతినిధులు పాల్గొనే ఈ మహాసభలను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. భవిష్యత్తు కార్యాచరణ, పలు అంశాలపై తీర్మానాలు చేయడం జరుగు తుందన్నారు. కేంద్రంలో అధికారంలోకి రావడానికి బీజేపీ పార్టీ దొంగ ఓట్లను సృష్టించి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘంపై అనుమానాలను వ్యక్తం చేస్తూ దొంగ ఓట్ల సంఖ్య పెంపునకు కారకులైన బిజెపి పార్టీని బర్తరఫ్ చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌల్, నక్క వెంకటస్వామి, కాదండి సాంబయ్య, మామిడి గోపి, మల్లేష్, దేవానందం, సాంబయ్య పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై షీ టీమ్ అవగాహన సదస్సు

- మందమర్రి ఎస్ఐ రాజశేఖర్



**రామకృష్ణాపూర్, ఆగస్ట్ 11 (జనంసాక్షి):** రామగుండం సీపీ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా మందమర్రిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం షీ టీమ్ సభ్యులు, మందమర్రి పోలీసులతో కలిసి మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, షీ టీమ్ ప్రాముఖ్యత, విధులు, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్యవివాహాల దుష్పరిణామాలు, ఈవ్‌టీజింగ్, టీ సేఫ్ యాప్, పోష్ చట్టం, సోషల్ మీడియా ప్రభావం, సైబర్ నేరాలు, సైబర్ హెల్ప్‌లైన్ (1930), డయల్ 100 ప్రాముఖ్యత, నేరాల నివారణ మార్గాలు, మహిళల-పిల్లల రక్షణ చట్టాలు, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు.ఎవరైనా డ్రగ్స్ వాడినా, మహిళలను వేధించినా, రోడ్డుపై అవహేళన చేసినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్ 100, రామగుండం షీ టీమ్ నంబర్ 6303923700కు ఫిర్యాదు చేస్తే,తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి, మందమర్రి పోలీసు సిబ్బంది, కానిస్టేబుల్స్ శ్రవణ్, సతీష్, జ్యోతి, శ్రీలత, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేయూ ఓపెన్ పీజీ,
## డిగ్రీ ప్రవేశానికి సెప్టెంబర్ 10 గడువు




**బెల్లంపల్లి, ఆగష్టు 11, (జనంసాక్షి):** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గల కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య పిజి, డిగ్రీ కోర్సులలో ప్రవేశానికి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రాతిపదికన దరఖాస్తు తీసుకునేందుకు గడువును సెప్టెంబర్ 10వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం 2025-26లో పీజీ లేదా డిగ్రీ చేసేందుకుగాను ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ పీజీలో ఎంఏలో అన్ని సబ్జెక్టులలో, ఎం.కామ్ చదివేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఓపెన్ డిగ్రీలో బిఏ, బీకాం, బీఎస్సీ అన్ని కోర్సులలో అడ్మిషన్లు ఉన్నాయని తెలిపారు. దూరవిద్య ద్వారా పీజీ లేదా డిగ్రీ చేయాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీజీ చేసేందుకు స్టడీ సెంటర్ కోడ్ నెంబర్-770 ద్వారా,డిగ్రీ చదివేందుకు స్టడీ సెంటర్ కోడ్ నెంబర్-043 ద్వారా ఆన్లైన్‌లో www.sdlceku.co.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకొని ప్రింట్ అవుట్ కు సంబంధిత సర్టిఫికెట్లు జతచేసి 2 సెట్లు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో గల కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య స్టడీ సెంటర్లో అడ్మిషన్ అప్లికేషన్ ఫామ్స్ నింపి అందజేయాలని ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ కోరారు. వివరాలకు 9959269975 నంబర్ లో సంప్రదించాలని సూచించారు.

## ఖానాపూర్ నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక



**ఖానాపూర్ రూరల్ 11 ఆగష్టు (జనంసాక్షి):** ఖానాపూర్ నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నుకున్నారు.స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖానాపూర్ నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు గా గాండ్ల రాజశేఖర్,గౌరవ అధ్యక్షుడుగా సట్ల శంకర్,ప్రధానకార్యదర్శి గా కోళ్ల రాజు,వర్కింగ్ అధ్యక్షుడుగా షేక్ తన్వీర్,కోశాధికారిగా మహమ్మద్ ఇద్రిస్, ఉపాధ్యక్షుడుగా పుప్పాల శేఖర్,షేక్ ముజీబ్,కైసర్ మోహినోదిన్, సమన్వాయ కర్తగా పాలిక్ శ్రీనివాస్,ప్రచార కార్యదర్శిగా సాజిత్,సంయుక్త కార్యదర్శిగా మోగిలి నర్సయ్య,షేక్ పర్వేజ్,ముఖ్యసలహా దారులు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

## మండల కాంగ్రెస్ పార్టీ సమావేశం ఏర్పాటు



**నస్పూర్ (జనంసాక్షి):** నస్పూర్ పట్టణంలోని 1వ వార్డ్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు భీమ్ శంకర్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగానస్పూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నూకల రమేష్ హాజరవగా సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించడం జరగింది.సమావేశంలో స్థానిక ముఖ్య కార్యకర్తలకు భవిష్యత్తు దిశా నిర్దేశం చేశారు.ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ ముందుండాలి తెలిపారు.కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు,పెన్షన్లు అందేలా కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి మెంబర్ భీమ్ రవి, మాజీ కౌన్సిలర్ బండి పద్మ,మహిళ అధ్యక్షురాలు అనూష, మహిళ నాయకురాలు కమలమ్మ, దాసు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసిన జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. విపిన్ కుమార్



**ములుగు/వెంకటాపూర్,ఆగస్టు11(జనం సాక్షి) :** ఆల్బెండజోల్ మాత్రలు శరీర శ్రమ వ్యక్తిగత పరిశుభ్రత తో విద్యార్థులు ఆరోగ్యవంతులై వారి వారి లక్ష్యాన్ని సాధించి సమాజంలో ఉన్నత స్థాయిలో ఉంటారని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ .విపిన్ కుమార్ తెలిపారు.జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా మండలం మరియు గ్రామం వెంకటాపూర్ లోని ఉన్నత పాఠశాలలో ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ,నులిపురుగులు చిన్న ప్రేగులలో స్థావరాన్ని ఏర్పరచుకొని, భుజించిన ఆహారలోనీ పోషక పదార్థాలను తినడం మూలంగా,విద్యార్థిని విద్యార్థులు రక్తహీనతకు గురై శారీరకంగా, మానసికంగా పెరుగుదల ఆగిపోవడం, కడుపునొప్పి వికారం,తలనొప్పి మొదలగు లక్షణాలు ఉంటాయని తెలుపుతూ,బహిర్గత మలవిసర్జన చేయకుండా ఉండాలని, లేనియెడల నేల కాలుష్యము ఏర్పడి, పిల్లలు నెలలో ఆడినప్పుడు నులిపురుగులు చర్మాన్ని తొలిచి అంతర్భాగం లోకి ప్రవేశించి చిన్న ప్రేగులో స్థావరాలు ఏర్పరచుకుంటాయని వివరించారు. అందులకే పిల్లలు నేల లో ఆడినప్పుడు,మలమూత్ర విసర్జన అయిన తర్వాత ఆహారము భుజించే ముందు, సబ్బుతో చేతులను శుభ్రపరచుకొని చేయడం మూలంగా నులిపురుగుల వల్ల వచ్చే ఇబ్బందులను దూరం చేయవచ్చు అని తెలిపారు.అటు తర్వాత జిల్లా శిశు ఆరోగ్యము మరియు వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్. రణధీర్ మాట్లాడుతూ, ములుగు జిల్లాలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు టీములుగా ఏర్పడి,అంగన్వాడి ప్రైమరీ స్కూల్ ఉన్నత పాఠశాల కాలేజీలలో నీ ప్రభుత్వ ప్రైవేటు విద్యార్థిని విద్యార్థులకు ఈరోజు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందజేయడం జరిగిందని సోమవారం రోజున స్కూలుకురాని విద్యార్థిని విద్యార్థులకు రెండోవ రౌండ్ ద్వారా 18 ఆగస్టు రోజున మళ్లీ ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తామని, 1-2 సంవత్సరాల పిల్లలకు 1/2 టాబ్లెట్ మాత్రమే చూర్ణం చేసి పాలలో గాని నీటిలో గాని కలిపి తాగిస్తున్నామని, 2-3 సంవత్సరముల విద్యార్థులకు ఒక టాబ్లెట్ చూర్ణాన్ని పాలలో గాని నీటిలో గాని కలిపి మింగించడం జరిగిందని తెలిపారు.జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో ఈరోజు 4766 మంది విద్యార్థులకు గాను 4037 విద్యార్థులకు ఈ మండలంలో ఆల్బెండజోల్ మాత్రలు మింగించామని మిగతా విద్యార్థులకు 18 ఆగస్టు రోజున మాత్రలు అందించి అందరి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసేటట్లు ప్రణాళికలు తయారు చేసుకున్నామని, వైద్య ఆరోగ్యశాఖతో పాటు విద్యాశాఖ స్త్రీ శిశు సంక్షేమ శాఖ,పంచాయతీల శాఖ సంఘటితంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెంకటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ టి రాధిక,డెమో సంపత్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపత్ రావు ఏం శ్రీనివాస్ పబ్లిక్ హెల్త్ నర్స్ శోభ హెల్త్ సూపర్వైజర్ పుష్పకుమారి ఉపాధ్యాయురాలు సంధ్య ఉపాధ్యాయులు అంబేద్కర్ చెన్నకేశవ ఆరోగ్య కార్యకర్తలు అనురాధ,స్వప్న మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అటవీ భూములు అన్యాక్రాంతం

అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**అటవీ భూమిలో పోడు విస్తరిస్తే కఠిన చర్యలు తప్పవు :**

**ఫారెస్ట్ రేంజర్ అశోక్ కుమార్**



అటవీ భూమిలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులు తమ పక్కనే ఉన్న అటవీ భూమిలో పోడు విస్తరిస్తే కఠిన చర్యలు తప్పవు అని వారు ఎంతటివారైనా వారిని ఉపేక్షించేది లేదని తెలిపారు. ఇటీవల బుచ్చంపేటలో పోడు చదును చేస్తున్నట్లు సమాచారం రావడంతో వారిపై కేసు నమోదు చేయడం జరిగింది అని అందులో చదును చేస్తున్న డోజర్ ట్రాక్టర్లను కూడా సీజ్ చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడ పోడు విస్తరణ జరిగినా క్షణాల్లో తెలుసుకునేందుకు బేస్ క్యాంప్ సిబ్బంది వేసవి కాలంలో అడవులను రక్షించి పోడుపై దృష్టి సారించాలనే ఉద్దేశంతోనే వాచర్లను కూడా నియమించినట్లు తెలిపారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పక్కన పోడు విస్తరించినట్లు తెలిసిన వెంటనే పట్టా వరకే రైతులకు ఇచ్చి మిగతా భూమిలో మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. అలాగే పోడు భూములకు అటవీశాఖ అధికారులు సహకరిస్తే వెంటనే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని అలాగే అడవుల నరికివేత పై కఠినంగా వ్యవహరించనున్నట్లు వారు తెలిపారు.



# గణపురం సముద్రంలోకి నీటిని విడుదల చేయాలి

**గణపురం,ఆగస్టు 11(జనం సాక్షి):** దేవాదుల ప్రాజెక్ట్ నుండి గోదావరి నీరు రామప్ప చెరువులో చేరడం జరుగుతుందని, గ్రావిటీ కెనాల్ ద్వారా గణపసముద్రం చెరువులోకి నీటిని వదిలి దాని ఆయకట్టు రైతులకు ప్రయోజనం చేకూర్చి రైతులకు న్యాయం చేసి చర్యలు తీసుకోవా లని సోమవారం గణపురం తహసిల్దారు మధురకవి సత్యనారాయణ స్వామికి బిజెపి మండల పార్టీ అధ్యక్షులు నవీన్ రావు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దుగ్గిశెట్టి పున్నం చందర్, మండల ఉపాధ్యక్షులు మాదాసు మొగిలి , బూత్ అధ్యక్షులు కాశెట్టి సాయి, కన్వీనర్, మండల రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే రేపు మండల కేంద్రం లో జరిగే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లో అందరు పెద్ద ఎత్తున పాల్గొని స్వాత్రంత్ర సమర్యోదులను గుర్తు చేస్తూ బావితరాలకు తెలియజేయాలనీ ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు .

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

గల హనుమాన్ మందిర్ వెనుక నాలా వంకరగా ఉండడంతో మురుగునీరు రోడ్డుపైకి వస్తుందని, నాలాను ఎలాంటి వంకలు లేకుండా సరిచేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం ఆర్ కె 6, కృష్ణ కాలనీకి చెందిన హరీష్ శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్ కె 6 లో గల సి టైప్ క్వార్టర్లకు సంబంధించి మురుగునీటి సెప్టిక్ ట్యాంక్ పగిలిన కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ప్రతినిధి సికిందర్ తన దరఖాస్తులో చెన్నూర్ లో షెడ్యూల్డ్ కులాల కళాశాల, బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరారు. లక్షెట్టిపేట మండల కేంద్రానికి చెందిన మామిడి రాజశేఖర్ దివ్యాంగుడు అయిన తాను ఇంటర్ పూర్తి చేసి ఎం. ఎల్. టి. 1 సంవత్సరం శిక్షణ పొందానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం గుడి పేట గ్రామానికి చెందిన ఎంబడి జ్యోతి తన భర్త చనిపోయాడని, నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని, ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి ముల్కల్ల రాజేంద్రప్రసాద్ తన దరఖాస్తులో నస్పూర్ శివారులో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తికి జైలుశిక్ష

**2 సంవత్సరాల 3 నెలలు జైలు శిక్ష**

**రూ:12 వేల జరిమానా**

**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 11 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా మందమర్రి కి చెందిన ఎదునూరి సుధాకర్ కు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయమూర్తి కుమార్ వివేక్ 2 సంవత్సరాల 3 నెలల జైలు శిక్ష, 12 వేల రూపాయల జరినామ విధించినట్లు మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం... గత 2020 సంవత్సరంలో లంబాడి (ఎస్టి) కులానికి చెందిన 22 సంవత్సరాల యువతితో ఎదునూరి సుధాకర్ 2016 నుండి ప్రేమ వ్యవహారం నడిపి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరకంగా వాడుకుని మోసం చేశాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు, 20 డిసెంబర్ 2020 నాడు అప్పటి మందమర్రి ఎస్ఐ ఎల్ భూమేష్ కేసు నమోదు చేశారని వెల్లడించారు. ఆ తర్వాత బెల్లంపల్లి ఏసీపీ ఎం.ఎ. రెహమాన్ విచారణ చేపట్టి, నిందితుడిపై సెక్షన్లు 376(2)(ఎన్), 417, 420 ఐపీసీతో పాటు సెక్షన్ 3(2)(వీ) ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేశారని వివరించారు. కాగా ఇట్టి కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముస్కు రమణారెడ్డి 14 మంది సాక్షులను విచారించి నేరాన్ని ఆధారాలు, సాక్ష్యాలను ప్రవేశపెట్టి నిరూపించినట్లు పేర్కొన్నారు. వీటన్నిటిని పరిశీలించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి, నిందితుడికి సెక్షన్ 417 ఐపీసీ కింద 3 నెలల సాధారణ జైలు శిక్ష, 2,000 జరిమానా, అలాగే సెక్షన్ 420 ఐపీసీ సెక్షన్ కింద, 2 సంవత్సరాల జైలు శిక్ష, 10,000 జరిమానను చెల్లించని పక్షంలో అదనంగా 3 నెలల జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కేసులో న్యాయం జరిగేలా కృషి చేసిన మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, లైసెన్ అధికారి, సీడీవోలను, మంచిర్యాల డీసీపీ భాస్కర్ ప్రశంసించారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

సూచించారు. విద్యుత్తు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై స్టాళ్ల ఏర్పాటుకు డిఆర్డీఓ కు జాబితా ఇవ్వాలని సూచించారు. అన్ని కార్యక్రమాలు మినిట్ టు మినిట్ సజావుగా సక్రమంగా నిర్వహించుటకు ఆర్డిఓ పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ రవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు తెల్ల రేషన్ కార్డుల పంపిణీ

దేశ స్థాయిలో ఘన కీర్తి కలిగించిన ప్రయత్నం సరస్వతి పుష్కరాలు నిర్వహించిన్నట్లు గుర్తు చేశారు.ఈ ప్రాంత ప్రజల ఆశీర్వాదం ఎప్పుడూ ఉండాలని, మా నాన్న శ్రీపాదరావు ఆశయ సాధన కు కృషి చేస్తు,ఈ ప్రాంత మహిళా లకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో మేం పని చేస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాపు, కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య, మండల పార్టీ అధ్యక్షుడు వేమూరు ప్రభాకర్ రెడ్డి, మంత్రి నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీమల సందీప్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిటూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్పి ఓసిపిలో సిఐటియు ద్వార సమావేశం

**శ్రీరాంపూర్(జనంసాక్షి):** ఏరియా సింగరేణి ఎస్ఆర్పి ఓసిపి లో బ్లాస్టింగ్ కాంట్రాక్టు కార్మికుల మాస్టర్ పాయింట్ వద్ద ఎస్సీ కేఎస్ సిఐటియు ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా ఎస్సీ కేఎస్ రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్,సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ పాల్గొనగా సోమవారం ద్వారా సమావేశం ఏర్పాటు చేయడం జరగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ మనుగడ కోసం తమ కుటుంబాలను పోషించుకోగలిగే ఉపాధినిచ్చే భూములను సైతం ఇస్తే, సింగరేణి యాజమాన్యం ఉపాధి పేరుతో కనీసం వారి కుటుంబాలను పోషించుకోడానికి సరిపడే కనీస మాస్టర్లు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టాలి



**నర్సంపేట ఆగస్టు 11 ( జనం సాక్షి) :** నర్సంపేట పట్టణంలోని చెందిన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారంవినతిపత్రం ఇచ్చినట్లు విద్యార్థి సంఘాల నాయకులు బోట్ల నరేష్, కాడపాక రాజేందర్, శనిగరపు రాజేంద్రప్రసాద్, తెలిపారు వారు మాట్లాడుతూ... వరంగల్ జిల్లాలోని నర్సంపేట పట్టణ పరిధిలో ద్వారక పేట రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నర్సంపేట డివిజన్ పరిధిలోని వివిధ మండలాలలోని విద్యార్థులు ఇంటర్మీడియట్ అడ్మిషన్ కోసం ప్రభుత్వ కళాశాలలో చేరగా అట్టి విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.. ఇటీవల కాలంలో కురిసిన వర్షాల వలన భవనం శిథిల అవస్థలో ఉండడంతో తరగతి గదుల్లో ఎప్పుడు ఏ విద్యార్థి పై పెచ్చులు ఊడి పడతాయో భయంతో తరగతులు పరిస్థితి నెలకొందని జిల్లా కలెక్టర్ వివరించడం జరిగింది. తెలిపారుఇట్టి సమస్యపై స్పందించి సి ఎస్ ఆర్ నిధుల ద్వారా నూతన భవనానికి నిధులు కేటాయించి విద్యార్థులను ఆదుకోవాల్సిందిగా వారు కోరారు.

# రాముని చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ను అందుబాటులోకి తేవాలి

- స్వచ్ఛంద పౌర సేవ సంస్థ ప్రధాన కార్యదర్శి తులామధుసూదన్ రావు

**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 11 (జనంసాక్షి) :** మంచిర్యాల పట్టణంలోని రాముని చెరువు పార్క్ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని రాముని చెరువు పార్క్ ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సోమవారం నాడు స్వచ్ఛంద పౌర సేవా సంస్థ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో చెరువు కట్టపైన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి నాయకుడు స్వచ్ఛంద పౌర సేవ సంస్థ ప్రధాన కార్యదర్శి తులామధుసూదన్ రావు మాట్లాడుతూ... గత సంవత్సరం డిసెంబర్ నెలలో రాముని చెరువు యొక్క వాకింగ్ ట్రాక్ పై ఉన్న చెట్ల పొదలను తొలగించి ప్రజలు చెరువు చుట్టూ వాకింగ్ చేసుకునే విధంగా అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు . కలెక్టర్ త్రీ మెన్ కమిటీ తో ఎంక్వైరీ చేయించి, జనవరి నెలలో ట్రాకు పునరుద్ధరించాలని చెట్ల పొదలను తొలగించి



ప్రజలకు అందుబాటులో ట్రాక్ తేవాలని, అదేవిధంగా చెరువులో పోస్తున్న మట్టిని ఆపే విధంగా చర్యలు తీసుకొని, పోసిన మట్టిని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు ఇవ్వడం జరిగింది అని అన్నారు. కలెక్టర్ ఆదేశాలు ఇచ్చి 8 నెలలు గడుస్తున్నా కలెక్టర్ ఆదేశాలను ఉద్యోగులు బేఖాతరు చేసి ఈరోజు వరకు కూడా చెరువు యొక్క చెట్ల పొదలను తొలగించకపోవడం బాధాకరమన్నారు. కలెక్టర్ చెబితే కూడా పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇక్కడ పాలన పడకేసిందని స్పష్టంగా అర్థం అవుతుంది అన్నారు. అధికారులు కలెక్టర్ మాట వింటా లేరని తేలిపోయింది. వాకింగ్ ట్రాక్ పునరుద్ధరించడమే కాకుండా, చెరువులోకి వచ్చే మురికి నీరుని శుద్ధి చేయడానికి ప్రభుత్వం సీనరేజ్ ప్లాంట్ ఏర్పాటు కూడా చేయాలని తద్వారా చెరువు పరిశుభ్రమైన నీటితో నిండి ఉంటుందని అన్నారు. మేము ప్రజాస్వామ్యయుతంగా ప్రభుత్వ పెద్దలకు తెలిసే విధంగా పాలకులకు అర్థమయ్యే విధంగా కార్యక్రమాలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద పౌర సేవ సంస్థ అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి తులా మధుసూదన్ రావు తోపాటు సంస్థ సభ్యులు రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎరువుల పంపిణీలో కూపన్ల పంపిణీ రద్దు



- నేరుగా రైతులకు పంపిణీ
- పిఎస్ఎస్‌సి చైర్మన్ ఉమామహేశ్వరరావు

**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 11 ( జనం సాక్షి) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద ఎరువుల పంపిణీలో ఇకమీదట కూపన్ల పంపిణీ రద్దయినట్లు ం చైర్మన్ ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు మండల వ్యవసాయ అధికారుల ద్వారా రైతులకు కూపన్లు పంపిణీ చేయించి, అనంతరం సహకార సంఘం కార్యాలయంలో రైతులకు ఎరువులను పంపిణీ చేసేవారు. గత శుక్రవారం నాడు ఎరువుల పంపిణీ బాధ్యతలను తమకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. అలంకారప్రాయంగా తమకు పదవులు ఎందుకని ప్రశ్నించారు. దీంతో జిల్లా ఉన్నత అధికారులు స్పందించి ఎరువుల పంపిణీ బాధ్యతను కాగజ్ నగర్ ప్రాథమిక వ్యవసాయ సంఘం పాలకవర్గానికి అప్పగించారు. దీంతో గతంలో మాదిరిగానే నేరుగా రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు చైర్మన్ ఉమామహేశ్వరరావు తెలిపారు. అదేవిధంగా మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ ఇకమీదట తమ ఆధ్వర్యంలో రైతులకు ఎరువుల కూపన్లు జారీ చేయబడవని తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు తిరుపతి గౌడ్, ధరణి రామయ్య, కె కారి నానాజీ, తదితరులు పాల్గొన్నారు.



# భవాని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో మాదాసు లక్ష్మణ్‌కు సన్మానం

**గణపురం, ఆగస్టు 11(జనం సాక్షి ):** గణపురం మండల కేంద్రానికి చెందిన కవి రచయిత మాదాసు లక్ష్మణ్ గౌడ్ ను భవాని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదులోని కూకట్పల్లి పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన భవన్ లో ఘనంగా సన్మానించారు. శ్రీ వైరాగ్యం ప్రభాకర్ సారథ్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కవితా సంకలనాన్ని తీసుకురావడం జరిగింది ఈ సందర్భంగా అందులో వ్రాసిన కవులచే కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం పుస్తకావిష్కరణ జరిగింది. కవులందరికి సన్మానించగా అందులో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం వాస్తవ్యులు లక్ష్మణ్ గౌడ్ కు అరుదైన గౌరవం దక్కింది ఈ కవి సమ్మేళనం పుస్తకావిష్కరణ వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించగా విశిష్ట కవి విశ్లేషకుడు నటుడు రచయిత సినీ గేయ రచయిత అయినా సాధనాల వెంకటస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు

**చెన్నారావుపేట, ఆగస్టు 11(జనం సాక్షి):** శ్రీ సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేక పూజలను నిర్వహించారు. శ్రావణమాసం సోమవారంను పురస్కరించుకొని శ్రీ సిద్దేశ్వర స్వామికి అభిషేక పూజల కోసం పంచామృతాలు, పూలదండలను జల్లి గ్రామానికి చెందిన కాట శ్రీనివాస్ పద్మ దంపతులు సమర్పించారు.ఈ సందర్భంగా భక్తులు శ్రీ సిద్దేశ్వర స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు బిక్షమయ్య శాస్త్రి, సాయి శాస్త్రి, గణేష్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్

**ఏటూరునాగారం, ఆగస్టు 11(జనంసాక్షి) :** జిల్లా వ్యాప్తంగా ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు మూడు, నాలుగు నెలల నుండి వేతనాలు చెల్లించడం లేదని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) మలుగు జిల్లా కార్యదర్శి బలుసుపాటి నరేష్ అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మిషన్ భగీరథ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా 150 నుండి 200 మంది కార్మికుల మిషన్ భగీరథ నీటి సరఫరా లో కేబిఎన్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ నీటి సరఫరా పథకంలో పనిచేస్తున్నారు. వారికి ఆయా కేబిఎన్ఆర్ సంస్థ కార్మికుల భద్రత కోసం ఈఎఫ్, పీఎస్ఐ లు ఇన్సూరెన్స్ లాంటివి ఏమి చేయించకుండానే అర కొర వేతనాలతో కాలం వెళ్ళదిస్తుందని అందులో పని చేసే కార్మికులకు కనీసం భద్రతను కల్పించే ఈఎస్ఐ పిఎఫ్ లను ఇన్సూరెన్స్ చేయడం లేదని దానివల్ల ఆయా కార్మికులు నష్టపోయే పరిస్థితి ఉందని అన్నారు అలాగే గత మూడు నాలుగు నెలల నుండి ఆయా కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం వల్ల ఆయా కార్మికులు కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలియజేశారు. ఈ క్రమంలోనే వారు ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజలకు అందించాల్సిన నీటి సరఫరా పనులను సకాలంలో చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. వెంటనే కేబిఎన్ఆర్ సంస్థ కార్మికుల ఉద్యోగ ఆరోగ్య భద్రత రిత్యా వారికి ఈఎఫ్ పిఎస్ఐ చెల్లించి వారికి రావలసిన నాలుగు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని మరల ప్రతినెల రెగ్యులర్ గా క్రమం తప్పకుండా వారి యొక్క జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ఆ అవినీతి అధికారిపై చర్యలేవి?

**కాళేశ్వరం , ఆగస్టు 12, ( జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం లోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయంలో పనిచేస్తున్న ఆ అవినీతి ఉద్యోగిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని బిజెపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొల్లం కిషన్ ఒక పత్రిక ప్రకటనలో ప్రశ్నించారు. గత 30 ఏళ్లుగా ఆలయంలో తిష్ట వేసి అన్నీ తానై ఏకచత్రాధిపత్యం చెలాయిస్తూ పలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఆ ఉన్నత ఉద్యోగిపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ విచారణ జరిపి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఆలయంలో పనిచేస్తున్న కిందిస్థాయి సిబ్బందిని ఇబ్బందులకు గురి చేయడం, ఆలయానికి సంబంధించిన కాంట్రాక్టు పనులలో కమిషన్లు దండుకోవడం, కిందిస్థాయి ఉద్యోగస్తులను ప్రమోషన్ల పేరుతో అడ్డగోలుగా డబ్బులు వసూలు చేయడం, ఉద్యోగస్తుల నియామకంలో అవకతవకలకు పాల్పడడం, కొత్తగా జరిగిన అర్చకుల నియామకాల్లో భారీగా డబ్బులు దండుకున్నాడని బహిరంగంగా విమర్శలు వెలువెత్తుతున్న సంబంధిత శాఖ నిమ్మకు నీరెత్తినట్టు ఉండడం దేనికి సంకేతం అని అన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి నిత్యం ఆలయ పరిపాలన వ్యవహారాలకు అందుబాటులో ఉండకపోవడంతో ఆ ఉద్యోగికి ఆడింది ఆట పాడింది పాటగా సాగుతుంది అని అన్నారు. ఆలయంలో ఈ ఉద్యోగి తీరుపై పలు పత్రికలలో వార్తా కథనాలు వెల్లువెత్తుతున్న , సోషల్ మీడియా వేదికగా పలు విమర్శలు వస్తున్న ఆలయ ఈవో ఎందుకు స్పందించడం లేదని అన్నారు. ఆ అవినీతి అధికారి పై వస్తున్న ఆరోపణల పై ఆలయ ఈవో స్పందించాలని డిమాండ్ చేశారు.

# యూరియా బ్లాక్ మార్కెట్‌ను నివారించాలి

- బహుజన సామాజిక కార్యకర్తలు సురేష్ బాబు, సంతోష్

**తొర్రూరు, ఆగస్టు 11( జనం సాక్షి ) :** రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన వ్యవసాయం ఇది రాష్ట్ర ప్రభుత్వానికి అరిష్టమని రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్ రెడ్డి,బహుజన సామాజిక కార్యకర్తలు సురేష్ బాబు ,సంతోష్ ,బాలాజీ లు రైతులతో కలిసి తొర్రూరు పట్టణ కేంద్రంలోని అన్నారం రోడ్డు వద్ద పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూరియా షాపు ముందు రోడ్డుమీద ధర్నాకు దిగారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో రైతులకు యూరియా అందించటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వారు అన్నారు.యూరియా బ్లాక్ మార్కెటింగ్ ద్వారా అధిక ధరలకు ప్రైవేట్ షాపులు అమ్ముతున్నారని దీన్ని అధికారులు అరికట్టాలని వారు అన్నారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు ప్రైవేటు షాపులు యూరియాను అమ్ముతున్నాయని ఆరోపించారు.

# కోటగుళ్ల లోశ్రావణ సోమవారం సందర్భంగా భక్తుల కోలాహలం



**గణపురం, ఆగస్టు11 (జనం సాక్షి):** శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు ప్రారంభించారు. అనంతరం నందీశ్వరుడు, గణపేశ్వరునికి పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామి వారిని నాగాభరణం పట్టు వస్త్రాలతో వివిధ రకాల పూలమాలతో కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణ సోమవారం సందర్భంగా స్వామివారికి వివిధ రకాల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం తులసి, మారేడు, ఉసిరి, తెల్ల జిల్లేడు, మేడి, నాగదేవుని పుట్ట వద్ద మహిళలు దీపాలను వెలిగించారు. శ్రావణ సోమవారం సందర్భంగా మండలంలోని నగరంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మా దాడి సత్యలక్ష్మి, నారాయణరెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలను బహుకరించారు.

# టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి పరామర్శ

**పెద్దవంగర ఆగష్టు 11(జనం సాక్షి) :** ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటామని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు చిట్యాల, అవుతాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గుంటుక మురళి,ఈదురు రాంచంద్రు,తల్లి లచ్చి నర్సమ్మ, మండల కేంద్రానికి చెందిన సూర్య పత్రిక విలేకరి కందుల శ్రీశైలం రోడ్డుప్రమాదంలో కుక్కల చిన్నమ్మ, సమినా భర్త, వేముల లక్ష్మయ్య, వేముల ఝాన్సి, ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబాలకు ప్రఘాడసానుభూతి తెలిపారు.